

రాము కార్టూన్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డ్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూన్స్ ఫోరమ్, హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో ఇటీవల నిర్వహించిన కార్టూన్స్ పోటీలో బండారులంకకు చెందిన మాడా రాము కార్టూన్ ప్రత్యేక జ్యూరీ బహుమతికి ఎంపికైనట్టు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీకి 72 మంది తెలుగు కార్టూనిస్టులు 194 వ్యంగ్య చిత్రాలను పంపగా 25 ఉత్తమ కార్టూన్స్ ని ఎంపిక చేశారని, బహుమతి ప్రధాన సభ ఈ నెల 14న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు కార్టూనిస్ట్ రాము తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక జ్యూరీ అవార్డు పొందిన కార్టూనిస్ట్ రాము ని పలువురు అభినందించారు.



కార్టూనిస్ట్ రాము

డెల్టా ఆధునికీకరణకు అడుగేదీ..!

- శిథిలావస్థలో లొల్ల ప్రధాన లాకులు
- ప్రతిపాదనలకే పరిమితమైన పనులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ జిల్లాలో 16 మండలాల్లోని పంట పొలాలకు సుమారు 2.10 లక్షల ఎకరాల ఆయుకట్టుకు సాగు, తాగునీరందించే లొల్ల లాకుల భవితవ్యం ప్రశ్నార్థంగా మారింది. అపర భగీరథుడు ఆర్థర్ కాటన్ 1881లో నిర్మించిన లొల్ల లాకుల వ్యవస్థకు ప్రమాదం పొంచివుంది. బ్రిటిష్ కాలంలో కట్టిన లాకులే నేటికీ కోనసీమ జిల్లాలోని పంట పొలాలకు సాగునీరు అందిస్తున్నాయి. గోదావరి మధ్య డెల్టా కాలువ నుంచి లొల్ల లాకుల వద్ద ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 16 మండలాలకు సాగు, తాగు నీరందిస్తోంది. ఈ లాకులు శిథిలావస్థకు చేరడంతో కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో లాకుల మీద భారీ వాహనాలు సైతం వెళ్లకుండా నిలువ చేశారు. పునర్మించేందుకు రూ.52 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పదేళ్లు పైనే కావస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం ముందుకు వస్తుందోనన్న ఆందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ గతంలో లొల్ల లాకులను పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఎంతమంది కలెక్టర్లు మారినా లాకులు అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధికారులు మాత్రం రూ.52 కోట్లతో లాకులను పునర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేసి ఉన్నత అధికారులకు నివేదించామని అనుమతులు రాగానే పనులు చేపడతామని చెప్తున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కాలువలకు నీటిని నిలుపుదల చేసి మళ్లీ జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తారు. ఈ రెండు నెలల సమయంలో లాకులకు మరమ్మతులు గ్రీజు వంటి పనులు చేపట్టాలి. దీనికోసం ప్రతి ఏడాది మెయింటినెన్స్ నిధులు రాకపోవడంతో కనీసం లాకులు షట్టర్లకు గ్రీజు కూడా పెట్టే పరిస్థితి లేదు. లస్కర్‌లే తమ సొంత ఖర్చులతో గ్రీజును పెడుతున్నారు. కాలువకు సాగునీటిని విడుదల చేయాలన్నా తగ్గించాలన్నా షట్టర్లను పైకి కిందికి దించాలి. లాకుల తలుపులు తుప్పు పట్టడంతో లస్కర్లు నానా అవస్థలు పడుతున్నారు. లొల్ల ప్రధాన లాకులకు ముప్పు వాటిల్లితే రాష్ట్రంలోనే ధాన్యాగారంగా పేరుందిన కోనసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పంట పండించి చేతికొచ్చే సమయానికి ప్రకృతి ఏదో రూపంలో దెబ్బ తీయడంతో రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొంతమంది రైతులు తమ విలువైన పంట భూములను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లొల్ల ప్రధాన లాకులను పునర్మించాలని రైతులు కోరుతున్నారు.



అమలాపురం గన్నవరం కాలువ



శిథిలావస్థకు చేరిన ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్



సాగునీరు వృథాగా పోతోంది

ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన లాకులు తలుపులు తుప్పు పట్టి శిథిలవస్థకు చేరడంతో సాగునీరు వథాగా పోతోంది. ఎప్పటినుండో లొల్ల ప్రధాన లాకులను పునర్నిర్మిస్తామని చెబుతున్నారే తప్ప పనులు చేపట్టడం లేదు. శిథిలావస్థకు చేరిన లోకులకు ఏదైనా విపత్తు సంభవిస్తే కోనసీమ జిల్లాలోని మండలాల్లో రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మిగులుతుంది. అధికారులు స్పందించి ఈ వేసవిలోనైనా లాకులను పునర్ నిర్మించాలి.

- ముదునూరి వెంకటరాజు, ఆత్రేయపురం.

రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపాము

లొల్ల ప్రధాన ప్రధాన లాకులను పునర్నిర్మించేందుకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాము. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. లాకులు క్లోజర్ టైమ్‌లో గ్రీజు పెట్టడం, మరమ్మతులు చేయడానికి ఎటువంటి మెయింటినెన్స్ నిధులు మంజూరు కాలేదు.

- పిల్లా సత్యనారాయణ,
జల వనరుల శాఖ ఇంజనీర్, లొల్ల లాకులు.

తాగునీటి సమస్యల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా వేసవి కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత గ్రామీణ తాగునీటి సరఫరా మున్సిపల్ శాఖలను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం ద్వారా సరాసరి వేతనాల చెల్లింపు, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని వేసవి స్టోరేజ్ ట్యాంకులను తాగునీటి రిజర్వాయర్లను కాలువలు మూసివేసేలాగా పూర్తిగా నింపుకో వాలన్నారు. మున్సిపల్ నీటి సరఫరా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగాల దాదాపు నిర్మాణం పూర్తి కావచ్చిన మంచినీటి పథకాలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తేవాలని అధికారులకు స్పష్టం చేశారు. వివిధ తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న మూడు నెలల్లో తాగునీటి ఎద్దడిగల ఆవాసాలు, శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల నీటి నిర్వహణ వ్యవస్థలు, పంపింగ్ ద్వారా తాగునీరు సరఫరా అయ్యే విధంగా వేసవి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి పటిష్టంగా అమలు చేయాలన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ చర్యలపై సమీక్షించి పంపిణీ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతాల్లో వడ గాల్పులు ఎండ తీవ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైన పనులు ఉంటే తప్ప బయట తిరగరాదని సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరూ ఆచరించి సురక్షితంగా జీవించాలని ఆయన సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పనులు నిర్వహించే చోట వేతన జీవులకు టెంట్లు వేసి వేసవి కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తూ గరిష్ట వేతనాలు పొందే విధంగా ఒక కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని సూచించారు నరేగా ద్వారా వంటకాలువల్లో గుర్రపు డెక్క, పూడికతీత పనులు, నీటి సంరక్షణ, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అభివద్ధి, తదితర పనులను చేపడుతూ రైతులకు ప్రజానీకానికి మేలు చేకూర్చాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సిహెచ్.ఎన్‌వి.కృష్ణారెడ్డి, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

వాలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వార్డు వాలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని సూరాయి చెరువు వార్డు సచివాలయంలో క్లస్టర్-1 వాలంటీర్‌గా బాలయోగి కాలువ గట్టుకు చెందిన విత్తనాల నాగార్జున విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ గత నెల 30న వైసిపి నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన క్లిప్పింగ్‌ల ఆధారంగా సంబంధిత సచివాలయ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీని దర్యాప్తునకు ఆదేశించారు. వాస్తవమేనని గుర్తించి వాలంటీర్‌ను విధుల నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్ వద్ద నున్న మొబైల్, సిమ్ కార్డు మరియు బయో మెట్రిక్ డివైజ్‌లను స్వాధీనం చేసుకుని, ఆ స్థానంలో మరొక వాలంటీర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

అంబాజీపేట టిడిపిలో ఆధిపత్య పోరు

ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలోని టిడిపి నాయకులు పరిచయ వేదికలో రెండు వర్గాలుగా మారి ఆధిపత్య పోరుకు సిద్ధం అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో పి.గన్నవరం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా జనసేన ఇన్చార్జి గిడ్డి సత్యనారాయణ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో బాబులు గారి మిల్లు వద్ద గిడ్డి పరిచయ వేదిక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ మూడు పార్టీల పొత్తు ధర్మం పాటించి సమైక్యంగా అత్యధిక మెజారిటీతో అభ్యర్థులను గెలిపించటానికి కృషి చేయాలన్నారు. జనసేన అభ్యర్థి గిడ్డి మాట్లాడుతూ మిత్రపక్షమైన టిడిపి నాయకులకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని అందరూ సమైక్యంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశం మధ్యలో మండల టిడిపి అధ్యక్షులు, మాజీ ఎంపీపీల మధ్య ఒకరిపై ఒకరు ఆరోపణలు తీసుకుంటూ రెండు వర్గాలుగా తయారయ్యారు. ముందు రోజు రాత్రి పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఒక వర్గాన్ని పిలిచి అభ్యర్థి గిడ్డితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయమై సమావేశంలో రెండు వర్గాల ఆధిపత్య పోరుతో కూటమి అభ్యర్థి గెలుపుకు సహకరిస్తారా.! అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ కూటమి వర్గాలుగా ఇలాగే ఉంటే సార్వత్రిక ఎన్నికల్లో మూడు పార్టీలు మూడు ముక్కలు అవడం ఖాయమంటూ ఆ పార్టీ నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, మాజీ ఎంపిపి డివివి సత్యనారాయణ, బొంతు పెదబాబు, మండల అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీను రాజు, గుడాల ఫణి, జి.వి.రాఘవులు, చిన్నం బాలవిజయారావు, ఎన్.వి.సుబ్బారావు, రాష్ట్ర ఎంబీసీ సభ్యులు యడ్లపల్లి తుక్కియ్య, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి నేతల వాగ్వివాదం



సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్‌సి సంఘం సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని వెలువలపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో బూల కృష్ణమూర్తికి చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది ఈ ఘటనలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యాసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ నేరేడిమిల్లి సత్యనారాయణ, కుసుమ సురేష్, గుమ్మడి వెంకట్ పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బస్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బస్టాండ్ సెంటర్ వద్ద వేసవి ఎండలను దష్టిలో ఉంచుకుని మన గంగవరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గంగవరం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు బస్టాండ్‌కు వస్తున్నందున ఇది ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ ఈ చలివేంద్రం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలందరికీ ఉపయోగపడే చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల మన గంగవరం చారిటబుల్ ట్రస్ట్ వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం కుందూరు గ్రామం నుంచి వైసిపి ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, ఎంఎల్ఎ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సోమవారం ప్రచారం ప్రారంభించారు. కుందూరు, తాడిగొయ్యి, సేరుపాలెం గ్రామాల్లో ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో వారు మాట్లాడారు. సంక్షేమ పథకాలకు వాటి అమలుకు వైసిపి చేసిన కృషిని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

తపాలా బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌పై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచే ఓటింగ్ విధానాలను చాలా స్పష్టతతో మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తపాలా బ్యాలెట్ ఇంటి నుండే ఓటింగ్ సన్నద్ధత చర్యలు అమలు విధానాల పై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారులు ఉద్దేశించి మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ పోలింగ్ విధుల్లో హాజరయ్యే ఉద్యోగులు అత్యవసర సేవలలో నిమగ్నమయ్యే సిబ్బంది జిల్లా కలెక్టర్ ద్వారా నిర్దేశిత లిఖిత పూర్వక అనుమతులు పొందిన సిబ్బందికి తపాలా బ్యాలెట్లు ముద్రించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్స్, మంచానికి పరిమితమై నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులను బిఎల్‌ఒల సహకారంతో గుర్తించి వారికి ఇంటి నుండే ఓటు వేసే విధానాన్ని అమలు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ సిబ్బందిలో కొందరు ఇతర ప్రాంతాలు, జిల్లాల చెందిన ఉద్యోగులు న్నారని, వీరిని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానానికి ఓటింగ్ సౌకర్యాలు కల్పించి అనుమతించాలన్నారు. జిల్లా స్థాయిలో పోలింగ్ సిబ్బందికి శిక్షణలు కొనసాగు తున్నాయని తెలిపారు. అసెంబ్లీ స్థాయిలో కూడా రెండోసారి శిక్షణను ఇప్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. మే 12వ తేదీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రిని పోలింగ్ సిబ్బందిని సెక్టార్ అధికారి పర్యవేక్షణలో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు మే 13వ తేదీ పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని అన్ని విధాల సమాయత్త పరచాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి, రాజోలు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్ఒలు ఎ.మదన్‌మోహన్‌రావు, ఎ.శ్రీరామ్ చంద్రమూర్తి, ఆర్‌డిఒలు ఎస్.సుధా సాగర్, జి.కేశవర్ధన్ రెడ్డి, జివివి.సత్యనారాయణ, ఎం.ఝాన్సీ రాణి, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డిపిఒ రాంబాబు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని గెద్దనపల్లి శివారు చింతలమెరక ఎంపిపి పాఠశాలకు చెందిన సంసాని శ్రీరామ్ శ్రీనీత్, కడలి ప్రియాంక నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. వారు ఉత్తీర్ణత సాధించడంలో కృషి చేసిన పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఉచిత నవోదయ శిక్షణా సంస్థ వ్యవస్థాపకులు మగాపు విజయ దుర్గారావును గ్రామస్తులు అభినందించారు. ఆయన అధ్వర్యంలో ఇదే పాఠశాల నుంచి 2022లో ఒకరు, 2023లో ఒకరు నవోదయకు ఎంపిక కావడం గమనార్హం.

కార్టూ'నిజం'





సుభాష్‌ను కలిసిన ఎస్‌సి సెల్ నాయకులు

సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించడం చట్ట విరుద్ధమని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు అన్నారు. సోమవారం టిడిపి నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి శుభాష్ క్యాంపు కర్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ ప్లాన్ చట్టాన్ని అతిక్రమించి నిధులను దారి మళ్లించిన సిఎం వైఎస్.జగన్, ఆయనకు సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ దళితుల సంక్షేమమే ధ్యేయంగా పని చేసి దళితుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పోతుల మాధవ్, టిడిపి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనుబాబు, బొమ్ము లక్ష్మణ రావు, జొన్నకుటి భాస్కర్, దడాల నాగార్జున, మోర్త చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో అందరికీ సముచితస్థానం : తోట

ప్రజాశక్తి-మండపేట

వైసిపిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికీ సముచిత స్థానం కల్పించారని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, ఉండమాటి వాసు మాట్లాడుతూ ఒక టిప్పర్ డ్రైవర్‌కు ఎంఎల్ఎ టికెట్ ఇవ్వడంతో పాటు కల్లుగీత కార్మికుని పార్లమెంట్‌లో కూర్చోబెట్టిన ఘనత సిఎం వైఎస్.జగన్‌కే దక్కుతుందన్నారు. పింఛన్ల పంపిణీలోను రాజకీయం చేస్తున్న టిడిపికి త్వరలో ప్రజల ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు, సిరిపురపు శ్రీనివాసరావు, పొలమాల సత్తిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి తోట

ఇమామ్ ఆలీకి ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-అమలాపురం, రామచంద్రపురం

మొదటి ఖలీఫా, మహమ్మద్ ప్రవక్త అల్లుడు హజరత్ ఇమామ్ ఆలీ వర్ధంతి సందర్భంగా ముస్లిం సోదరులు ఆయనకు సోమవారం ఘనంగా నివాళు ర్పించరాఉ. అమలాపురం 12వ వార్డు ముజాఫర్ సందులోని ఆస్థానే అబ్బాసియా పీర్ల పంజాలో ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు సుదూర ప్రాంతాల నుంచి మహిళలు, వృద్ధులు, పిల్లలు పెద్దలు అందరూ అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు, పంజాలో వర్ధంతి విశిష్టతను మహమ్మద్ హైదర్ అలీ వివరించారు. ఈ ప్రార్థనల్లో మసీదు అధ్యక్షుడు నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ పాల్గొన్నారు. రామచంద్రపురంలోని ద్రాక్షారామంలో ముస్లిం సోదరులు ఇమామ్ ఆలీ పేరును అలంకరించిన గుమటం ఊరేగించారు. ద్రాక్షారామం పరిసర ప్రాంతాల నుంచి ముస్లిములు హాజరయ్యారు.



ద్రాక్షారామంలో ఇమామ్ ఆలీ వర్థంతి



ఎజిపిని కలిసిన గొల్లపల్లి సూర్యారావు

ఎజిపిని కలిసిన గొల్లపల్లి

ప్రజాశక్తి-రాజోలు

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎర్రంశెట్టి అయ్యప్ప నాయుడును వైసిపి రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ గొల్లపల్లి ఎమ్మెల్యేగా గెలుపొంది చట్ట సభల్లో న్యాయవాద సమస్యలపై పోరాడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట న్యాయవాది చింతా ప్రసాద్, వైసిపి నాయకులు ఉన్నారు.

పలు గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సక్రమంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ముమ్మిడివరం సిఐ ఎన్.కొండయ్య కోరారు. మండలంలోని కొత్తలంక, చిన కొత్తలంక, మర్లపాలెం, కర్రివాని రేవు, అన్నంపల్లి, చింతపల్లి లంక వంటి సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సోమవారం 60 మంది కేంద్ర బలగాలకు చెందిన సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


బైకును ఢీకొన్న ఆటో

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జి.వేమవరం రాయమెరక ఆశ్రమం సెంటర్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జామకాయల తూము సెంటర్ నుంచి జి.వేమవరం వెళ్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గుంతలో పడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఒక మహిళకు తీవ్ర గాయాల పాలయ్యారు. బైకుపై వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.


కుటుంబ సభ్యులను విచారిస్తున్న అధికారులు

ఆసుపత్రిలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత చెల్లి ఆదిలక్ష్మి (22) పరిస్థితి విషమించి మతి చెందింది. ఈ సంఘటనపై గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ వివరాలను వెల్లడించారు. మండలంలోని సలపాక గ్రామానికి చెందిన చెల్లి ఆదిలక్ష్మికి అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఆదిలక్ష్మికి అనారోగ్య కారణంగా ఉండడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఆదిలక్ష్మి ఒంటిపై టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకోగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదిలక్ష్మికి ఏడాది వయస్సు కల్గిన కుమారుడు ఉన్నాడు. తహశీల్దార్ శాంతిలక్ష్మి, ఎస్ఐ తులసి రామ్ లు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో ఆటో తిరగబడి వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు గాయాలపాలయ్యారు. సామర్లకోట నుంచి పెద్దాపురం విద్యార్థులతో వెళ్తున్న ఆటో విమల్ కంపెనీ సమీపంలో ముందు వెళ్తున్న బైకును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థినులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థినులను సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట మహిళా ఎస్ఐ మౌనిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను వైసిపి పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ పరామర్శించారు.

రూ.1.20 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1.20 లక్షల విలువ చేసే నగదును సీజ్ చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనాలు తనిఖీలు చేస్తుండగా తాళ్లపూడికి చెందిన నీలం వీరభద్రరావు ఎటువంటి బిల్లులు లేకుండా విజయవాడ నుంచి కారులో రూ.1.20 లక్షలను తీసుకొస్తున్నారన్నారు. దీంతో సీజ్ చేశామన్నారు.

గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం కడియపులంక తూర్పు డెల్టా ప్రధాన కాలువలోకి సోమవారం స్నానానికిదిగి గల్లంతైన యువకుడు మృతి చెందాడని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం మండలం దామిరెడ్డిపల్లికి చెందిన రాయపాటి అయ్యప్ప(30) కడియపులంక సెంటర్ జాతీయ రహదారి పక్కన పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాలువలో స్నానానికి దిగిన అయ్యప్ప ప్రమాదవశాస్తు కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తిరుగుడు మెట్టకు చెందిన వివాహిత సైదు భాగ్యశ్రీ(24) కడుపునొప్పి భరించలేక సోమవారం ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తాళ్లపూడి ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. భాగ్యశ్రీ కొంతకాలంగా కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతోందన్నారు. మృతురాలి పెద్దమ్మ పంతుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. మృతురాలి భర్త సాయిబాబా మూడు నెలల క్రితం ఉపాధి నిమిత్తి గల్ఫ్ దేశాలకు వెళ్లాడని ఎస్ఐ తెలిపారు.

డీజిల్ అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముమ్మిడివరం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమట పాలెంకి చెందిన మంజుల సతీష్ కుమార్, నడకుదటి బాలకృష్ణ బొలెరో వాహనంలో సుమారు 2100 లీటర్ల డీజిల్ అక్రమంగా తరలిస్తుండగా ముమ్మిడివరం పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకుని డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

యానాం వార్తలు


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నేడు రాక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.వైధిలింగం మంగళవారం యానాం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్దాని దినేష్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం బాలయోగి స్టేడియం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి సావిత్రి నగర్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థి వెంట మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి, ఎంఎల్ఎ వైద్యనాథన్, పెద సత్య ఫేరుమాళ్, ఎఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ హరివరగన్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రతినిధి ఎ.కాంగయ్యన్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటంశెట్టి రామ్మూర్తి, మల్లాడి వీరస్వామి, కాదా పవన్, పెసల వెంకటేష్, దవులూరి పతి, విళ్ల చిన్ని, జి.దినేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - యానాం

ఎన్ఆర్.కాంగ్రెస్ పార్టీ, బిజెపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. సోమవారం స్థానిక యర్రా గార్డెన్లోని గాజుల మినీ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తాను యానాం అభివృద్ధి కోసం పుదుచ్చేరిలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్టు తెలిపారు. నమశ్శివాయం ఎంపీగా గెలుపొందిన పక్షంలో యానాం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో13 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 9వతరగతి ప్రవేశ పరీక్షకు 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు మొత్తం 161 మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది ఎంపికైనట్టు వెల్లడించారు.

బైకును కారు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్లలోని కొండాలమ్మ గుడి సమీపంలో సోమవారం బైకును కారు ఢీకొని ఒకరి తీవ్ర గాయాలయ్యాయి. రావులపాలెంకు చెందిన ఆదిమూలం ఈశ్వరరావు బైకుపై డివైడర్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి కారు ఢీకొని డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుని రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామానికి చెందిన కందుకూరి వెంకన్న కూలి పనుల మేస్త్రిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జాలిమూడికి చెందిన యడ్ల లచ్చయ్య డబ్బులు తీసుకుని పనికి రావట్లేదు. దీనిపై వెంకన్న జాలిమూడి వెళ్లి లచ్చయ్యను డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. లచ్చయ్య అన్న కొడుకు రాంబాబు బకెట్‌తో వెంకన్నను కొట్టాడు. దీంతో తలపై, కుడి భుజంపై వెంకన్నకు రక్తపు గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై యడ్ల అచ్చియమ్మ, కందుకూరి ప్రదీప్, కండవల్లి శేఖర్, మేకల సుబ్రహ్మణ్యంపై కౌంటర్ కేసు నమోదైంది.

అత్యాచార యత్నంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి వికలాంగురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకునిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని తల్లిదండ్రులు ఎప్పటిలాగే ఇంట్లో వదిలి కూలి పనికి వెళ్లారు. రోజూ ఇది గమనిస్తున్న అదే గ్రామానికి చెందిన అంజి అనే యువకుడు సోమవారం ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై అత్యాచారం చేయడానికి నోరు నొక్కి ఆమెను ప్రయత్నించాడు ఇంతలో ఆమె గట్టిగా అరవడంతో అంజి పారిపోయాడు. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చాక యువతి విషయం తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఘర్షణ పడిన యువకులపై కేసు

ప్రజాశక్తి - కడియం

కడియం దేవి సెంటర్లో ఘర్షణకు దిగి అలజడి సృష్టించిన యువకులపై కేసులు నమోదు చేశామని సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం దేవి సెంటర్లో ఆదివారం సాయంత్రం ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారంటూ వచ్చిన సమాచారంతో కడియం ఎస్ఐ బిఎన్ దుర్గాప్రసాద్ తన సిబ్బంది హుటాయుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. యువకులను పట్టుకునే క్రమంలో పోలీసుల రాకను గుర్తించిన కొందరు పరారవ్వగా మరికొందరు తాము కాదంటూ పోలీసులపై వాదనలకు దిగారు. సిఐ బి తులసిధర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఘటన స్థలానికి చేరుకొని ఘర్షణ పడ్డ 8 మంది యువకులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన యువకులకు వారి పెద్దల సమక్షంలో సీఐ తులసిధర్, ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశంలో ఘర్షణ పడినందుకుగాను వారందరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. వారందరినీ క్రిమినల్ కోర్టుకు హాజరు కావాల్సిందిగా బాండ్ తీసుకొని పంపించినట్లు సిఐ తెలిపారు. రౌడీ చర్యలు, అల్లరి చేయడం, ప్రజాశాంతికి భంగం కలిగించడం, బహిరంగ ప్రదేశాల్లో అలజడులు వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఒకసారి క్రిమినల్ కేసులలో పేర్లు నమోదు అయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యువతను సిఐ హెచ్చరించారు.

కొబ్బరి ఒలుపు దింపు కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి ఒలుపు దింపు కార్మికులను ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అమలాపురం యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం బొక్కా వణువులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దింపు వొలుపు కార్మికుల సమస్యలపై కార్మికులు చర్చించారు. సిఐటియు జిల్లా కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడారు. కొబ్బరి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే వరకు శాసనమండలి ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కొబ్బరి కార్మికుల జిల్లా మహాసభ ఈ నెల 15న అమలాపురం యుటిఎఫ్ ఎంప్లాయీస్ హోమ్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుండి కార్మికులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. మహాసభ జిల్లా కన్వీనింగ్ కమిటీని నాయకులు ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్‌గా పాతాళ శ్రీనివాసరావు, కొడమంచిలి శ్రీను, బొక్కా వణువులు, నేదునూరి లోవరాజు, గుత్తుల శ్రీనివాసరావు, కొండేటి లక్ష్మణరావు నియమితులయ్యారు.

ఇసుక ర్యాంపులు తెరవాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అమలాపురం



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బలరామ్

గోపాలపురం, మందపల్లి, ఊబలంక, ఆత్రేయపురం, జొన్నాడ, వద్దిపర్రు, అంకంపాలెంకు చెందిన కార్మిక నాయకులు సిఐటియు నాయకులు నూకల బలరాం అధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి ఇసుక కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ నిబంధన పేరుతో ఇసుక ర్యాంపులు నిలిపివేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఎన్నికల కోడ్ నిబంధన పేరు చెప్పి ఇసుక ర్యాంపులు నిలిపివేయడం దారుణమన్నారు. మూసివేసిన ఇసుక ర్యాంపులను వెంటనే తెరిపించాలని కార్మికులకు పని కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ ఇసుక రాంపులు మూసివేయడంతో కార్మికులకు పనులు లేకుండా పోయాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బసివి రెడ్డి, వేణు, నాగేశ్వరరావు, సుబ్బారావు, రాము, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ వైసిపి అసత్య ప్రచారాలు

ప్రజాశక్తి-మండపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు

అసత్యాలు ప్రచారం చేస్తూ వైసిపి నాయకులు ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుకుంటారని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ 3 నే పింఛన్లు ఇచ్చామని, ఈ సంవత్సరం కూడా అలాగే ఇస్తామని సాక్షి పేపర్లో మార్చి 28న రాసారన్నారు. పింఛను డబ్బులు ఒకటవ తేదీన ఇచ్చే ఉద్దేశం వుంటే నియోజకవర్గంలోని ముగ్గుర ఎంపిడిఒలు, పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ అకౌంట్లలో ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. పోనీ ఎవరో ఆపేసి వుంటే కనీసం డబ్బులయినా ఎందుకు జమ కాలేదో సమాధానం చెప్పాలన్నారు. వాలంటీర్లు కాకపోతే సచివాలయ ఉద్యోగులతో ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ఇదంతా వైసిపి చేస్తున్న కుట్ర అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికీ 4 వేల రూపాయల పింఛను అందించే బాధ్యత తమదనిహామీ ఇచ్చారు. జనవరి 23న బటన్ నొక్కితే ఇప్పటి వరకు లబ్ధిదారులకు అసరా డబ్బులు ఎందుకు చేరలేదని ప్రశ్నించారు. చేయూత డబ్బుల పరిస్థితి అంతేనని, ఫిబ్రవరి 29న నొక్కిన విద్యాదీవెన బటన్ పరిస్థితి అంతేనని చెప్పారు. కేవలం బటన్లు మాత్రమే నొక్కి ప్రచారం చేసుకుంటున్నారని వాస్తవంగా చూసుకుంటే లబ్ధిదారులకు డబ్బులు చేరడం లేదన్నారు. సుమారు రూ.13 వేల కోట్లు వారికి కావాల్సిన కాంట్రాక్టర్లకు రూల్స్‌కు విరుద్ధంగా చెల్లించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వాలంటీర్ వ్యవస్థ రద్దు కాదని ఇంటింటికీ పింఛన్లు, రేషన్ పాత విధానంలోనే అందుతాయన్నారు. ఈ విషయాలను ప్రజలు వాలంటీర్లు గుర్తుంచుకోవాలన్నారు.

అందని పింఛన్లు, వృద్ధుల ఎదురు చూపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు ఏప్రిల్ ఒకటిన పింఛన్ల కోసం ఎదురుచూసి సొమ్ములు అందకపోవడంతో పలువురిని ఆరా తీస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వాలంటీర్లను విధుల నుంచి పక్కన పెట్టడంతో పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులను ఉపయోగించుకోవాలని ఆదేశాలు అందాయి. దీనికి తోడు ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు రావడంతో ఇప్పటివరకు పింఛన్లకు సంబంధించిన సొమ్ములు ఆయా పంచాయతీలకు ఇంకా చేరలేదు. దీంతోపాటుగా వాలంటీర్లు వద్ద ఉన్న పింఛనుదారుల వివరాలు సచివాలయంలో అందజేసి వారు విధులు నుంచి తప్పుకోవడంతో సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు లేదా మూడో తేదీన సొమ్ములు చేతికి అందిన తర్వాత పింఛన్ల పంపిణీ జరుగుతుదని పంచాయతీ అధికారులు వివరించారు. పింఛన్లను ఇంటికి వెళ్లి ఇవ్వకూడదని నిబంధనలు ఉండడంతో గ్రామ సచివాల యాలకు లేదా పంచాయతీలకు లబ్ధిదారులు వచ్చి పింఛన్లు తీసుకోవాలని సూచించారు. లేవలేని వద్ధులకు ఉన్నతాధికారుల సూచనల మేరకు పింఛన్లు అందజేస్తామని ద్రాక్షారామ గ్రామ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పింఛన్లకు వచ్చే వృద్ధులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకొని రావాలని, పెన్షన్ పాస్ బుక్కుపై ముఖ్యమంత్రి ఫోటో ఉండటంతో వాటిని తీసుకురాకూడదని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకూ పింఛన్ల పంపిణీ గ్రామ సచివాలయాల ద్వారానే జరగనుండడంతో వృద్ధులు వికలాంగులకు మూడు నెలల పాటు ఈ విధానం వల్ల ఇక్కట్లు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


పోటీలకు సిద్ధమైన విద్యార్థులు

'ప్రో - కార్ట్ రేసింగ్' పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకాని కల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 4 వరకూ జరిగే జాతీయ స్థాయి ప్రో కార్ట్ రేసింగ్ ఛాంపియన్ షిప్ సోమవారం ప్రారంభం అయ్యింది. ఈ పోటీలకు ఎపితోపాటు, చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రా లకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌ల సభ్యులు పాల్గొంటున్నారని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. 13 టీములకు మొత్తం 350 మంది సభ్యులు పాల్గొనడం జరిగిందన్నారు. నిష్ణాతులైన తటస్థ న్యాయనిర్ణేతల పర్యవేక్షణ లో ఎంపిక జరుగుతుందని తెలిపారు. వెహికల్ మోడల్, వెయిట్, బ్రేక్, ఇంజన్ పిక్ అప్, లోడ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన జరిగే ఫైనల్ పోటీల్లో స్పీడ్‌లో సైతం పోటీ నిర్వహించిన తర్వాత విజేతను ప్రకటించడం జరుగుతుందన్నారు. ప్రతీ విభాగం నుంచి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైకల్య నిర్ధారణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి ఉచిత ఉపకరణాలను అందించేందుకు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు ఎ.మధుసూదన రావు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ ఎంవి.సత్యనారాయణ పర్యవేక్షణలో వైకల్య నిర్ధారిత వైద్య శిబిరాన్ని మధుసూదన్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష సహిత విద్య సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. వైకల్యం నిర్ధారణ అయిన వారికి ఉచితంగా ఉపకరణాలను అందిస్తామని వివరించారు. ఈ శిబిరంలో కంటి, చెవి, ఆర్థోలకు సంబంధించి వైద్య నిపుణులు సుమారు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించి 35 మందికి కళ్లజోళ్లు, చెవికి సంబంధించి 62 మందికి హియరింగ్ ఎయిడ్స్, ఆర్థోకు సంబంధించి 83 మందికి వీల్‌ఛైర్స్ పంపిణీ చేసినట్లు సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ ఎంవి.సత్యనారాయణ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ ఎన్.విజయ్ కుమార్ (ఆర్థో), డాక్టర్ ఎం.నీలిమ (అడియాలజిస్ట్), డాక్టర్ టి.విజయ్ కుమార్(ఇఎన్‌టి), డాక్టర్ చందన (ఆప్తమాలజిస్ట్) తో పాటు ఐఇఆర్‌పిలు సమగ్ర విద్య పథకం ఎఫ్ఎఒ బి.ప్రవీణ్ కుమార్ ఎఎంఒ పి.రాంబాబు ఎపిఒ ఎంఎకె.భీమారావు, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం మండలాల నుండి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -మామిడికుదురు

ఊడుమూడిలో గ్రామ సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, వార్డు సభ్యులుతో పాటు 200 మంది వైసిపి కార్యకర్తలు సోమవారం టిడిపి అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి హరీష్ మాధుర్ పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు, మద్దాల సుబ్రహ్మమణ్యేశ్వరరావు, డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


దాతకు చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్న దాన ట్రస్ట్‌కు కొత్తపేటకు చెందిన మల్లంపల్లి అయ్యపరాజు బాలా త్రిపుర సుందరి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శేషగిరి సోమవారం రూ.25,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్, గ్రంది మాధవి తెలిపారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు మరియు సిబ్బంది స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదంలుఅందజేశారన్నారు.

నవోదయకు అంగర విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ఇటీవల జరిగిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో మండలంలోని అంగర గ్రామానికి చెందిన విద్యార్థిని కె.శ్రీలిఖిత ఎంపికైనట్లు ఎంఇఒ కె.తాతారావు తెలిపారు. ఈ సందర్భంగా అంగర శ్రీరామకష్ణ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న శ్రీ లిఖిత నవోదయ పరీక్షలకు ఎంపికయ్యింది. విద్యార్థిని ఎంపిక పట్ల అంగర, పడమర ఖండ్రిక, గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు, ఎంఇఒ తాతారావు, పాఠశాల కరస్పాండెంట్ తోరాటి వీరన్న బాబు, ప్రధానోపాధ్యాయులు జి.సురేష్ బాబు, కె.లలిత, ఉపాధ్యాయులు అభినందించారు.